


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 345, పేజీలు - 08
శుక్రవారం, జూన్ 5, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమి
# 'మహా కుంభకోణం'

## (నివేదికలున్నా నిమ్మకు నీరెత్తిన అధికారులు!)


దేప భాస్కర్ రెడ్డి

- రెండేళ్లుగా ఫైళ్ల కిందే నలుగుతున్న 'బండ్లగూడ' భూ స్కామ్!
- దేప భాస్కర్ రెడ్డి అక్రమాలపై 'భూభారతి' 'రెవెన్యూ రికవరీ' చట్టాల కింద చర్యలేవి?
- క్రిమినల్స్‌ను కటకటాల్లోకి నెట్టేది ఎప్పుడు? యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్న సామజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్.

**అక్షరాలా ఎనిమిది వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తి! పది ఎకరాల అత్యంత విలువైన భూమిని కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలతో నొక్కేస్తుంటే వ్యవస్థలు నిద్రపోతున్నాయా? లేక నిందితులకు పరోక్షంగా వత్తాసు పలుకుతున్నాయా? ఉప్పల్ మండలం, బండ్లగూడ పరిధిలోని సర్వే నెంబర్ 36/5 లో జరిగిన ఈ భారీ ల్యాండ్ స్కామ్‌పై కీసర ఆర్డీఓ "క్షేత్రస్థాయి ఎంజాయ్‌మెంట్ సర్వే నివేదిక" నిందితుల గుట్టును పూర్తి సాక్ష్యాధారాలతో రట్టు చేసింది. పత్రికా దర్యాప్తు ద్వారా 2024లోనే ఈ బండారం బయటపడినప్పటికీ 2026 జూన్ దాటినా నిందితులపై, వారికి సహకరించిన అధికారులపై ఆశించిన స్థాయిలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. క్రిమినల్స్‌ను కటకటాల్లోకి నెట్టేది ఎప్పుడంటూ యంత్రాంగాన్నిసామజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ గట్టిగా ప్రశ్నిస్తున్నారు.**


లచ్చి రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)

అక్షరాలా ఎనిమిది వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తి! పది ఎకరాల అత్యంత విలువైన భూమిని కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలతో నొక్కేస్తుంటే వ్యవస్థలు నిద్రపోతున్నాయా? లేక నిందితులకు పరోక్షంగా వత్తాసు పలుకుతున్నాయా? పత్రికా దర్యాప్తు ద్వారా 2024లోనే ఈ బండారం సాక్ష్యాధారాలతో సహా బయటపడినప్పటికీ 2026 జూన్ దాటినా నిందితులపై, వారికి సహకరించిన అధికారులపై ఆశించిన స్థాయిలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటి?
ఉప్పల్ మండలం, బండ్లగూడ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 36/5 లో జరిగిన రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమి మహా కుంభకోణంపై కీసర ఆర్డీఓ "క్షేత్రస్థాయి ఎంజాయ్‌మెంట్ సర్వే నివేదిక" నిందితుల గుట్టును పూర్తిగా రట్టు చేసినప్పటికీ, తదుపరి చర్యల్లో కాలయాపన ఎందుకు జరుగుతోందనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### కథేంటి? కుంభకోణం ఎలా సాగింది?

బండ్లగూడ పరిధిలోని సర్వే నెంబర్ 36/5 లో గల 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కాజేయడానికి ప్రధాన నిందితుడు దేప భాస్కర్ రెడ్డి మరియు అతని అనుచరులు పక్కా స్కెచ్ వేశారు. "రాచకొండ కనకయ్య" అనే వ్యక్తిని 'స్వాతంత్ర సమరయోధుడు' గా చిత్రీకరించి, అతని పేరు మీద నకిలీ పట్టాలు, ఫోర్జరీ రికార్డులను సృష్టించారు.అయితే, ఉన్నత స్థాయి రెవెన్యూ విచారణలో ఆ రాచకొండ కనకయ్య అసలు స్వాతంత్ర సమరయోధుడే కాదని, అక్కడ ఎలాంటి భూ కేటాయింపులు జరగలేదని, అది నూటికి నూరు శాతం ప్రభుత్వ భూమి అని అధికారికంగా తేలిపోయింది. నిందితులు అంతటితో ఆగకుండా, ఆ నకిలీ పత్రాల ఆధారంగా అమాయక ప్రజలకు ప్లాట్లు, ఫ్లాట్లు విక్రయించారు. అంతేకాదు, జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు మరియు బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీల (ఎన్ బి ఎఫ్ సి) నుండి వందల కోట్ల రూపాయల అక్రమ రుణాలు పొంది దేశ ఆర్థిక వ్యవస్థకే కన్నం వేశారు. ఈ భారీ బ్యాంకింగ్ మోసంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బి ఐ)కి సైతం ఫిర్యాదులు అందాయి. 2022 లోనే గౌరవ న్యాయస్థానం ఆదేశాలతో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ (ఎఫ్ఐఆర్ నంబర్: 1821/2022) నమోదైనప్పటికీ నిందితుల అక్రమ దందా సాగుతూనే ఉండటం గమనార్హం.

### ఆధారాల కొండ.. అయినా కదలని యంత్రాంగం!

ఈ కుంభకోణానికి సంబంధించి అధికారుల వద్ద ఒకటా రెండా.. సాక్ష్యాధారాల కొండలే ఉన్నాయి. 2024 నుండి 2026 మే వరకు జరిగిన సుదీర్ఘ విచారణలో ఎన్నో అధికారిక నివేదికలు వెలువడ్డాయి:
- కీసర ఆర్డీఓ ప్రాథమిక విచారణ నివేదిక
- తెలంగాణ రెవెన్యూ శాఖ (ఫ్రీడమ్ ఫైటర్ సెక్షన్) ఇచ్చిన నివేదిక, ఇందులో కనకయ్య ఫ్రీడమ్ ఫైటర్ కాదని స్పష్టమైంది.
- భూపరిపాలన ప్రధాన కమిషనర్ స్థాయికి చేరిన అధికారిక లేఖలు.
- ఉప్పల్ తహసిల్దార్ సమర్పించిన సమగ్ర క్షేత్రస్థాయి "ఎంజాయ్‌మెంట్ సర్వే నివేదిక" - దీని ద్వారా ఇది పక్కా ప్రభుత్వ భూమి అని, అక్కడ అక్రమ కట్టడాలు ఉన్నాయని పక్కాగా నిర్ధారణ అయింది.

తెలంగాణ విజిలెన్స్ కమిషన్, రెవెన్యూ విజిలెన్స్-1 శాఖలు కఠిన ఆదేశాలతో మెమోలు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకీ నత్తనడక? ఎవరిని కాపాడటానికి ఈ తాత్సారం? అని బాబా గౌడ్ అన్నారు.

### చట్టాలు చుట్టాలా?
### తక్షణమే తీసుకోవాల్సిన కఠిన చర్యలు ఇవే!

ఆర్డీఓ 'ఎంజాయ్‌మెంట్ సర్వే నివేదిక' ద్వారా నిందితుల అక్రమాలు బట్టబయలైన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో క్రింది చట్టాల ప్రకారం తక్షణమే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది:

**1. తెలంగాణ భూభారతి చట్టం ప్రకారం యాక్షన్ ప్లాన్:**

- నకిలీ రికార్డుల తక్షణ రద్దు (సుమోటో): సదరు సర్వే నెంబర్ 36/5 పై సృష్టించబడిన నకిలీ పట్టాలు, అక్రమ మ్యుటేషన్లను కలెక్టర్ తనకున్న అత్యున్నత అధికారాలతో తక్షణమే రద్దు చేయాలి.
- నిషేధిత ఆస్తుల జాబితా (సెక్షన్ 22-ఏ): ఈ భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22-ఏ (నిషేధిత ఆస్తుల జాబితా) కింద చేర్చాలి. తద్వారా నిందితులు భవిష్యత్తులో ఎలాంటి అక్రమ లావాదేవీలు, అమ్మకాలు చేయకుండా పూర్తి బ్రేక్ వేయవచ్చు.
- స్థలాల స్వాధీనం ఓ కూల్చివేతలు: ఎంజాయ్‌మెంట్ సర్వేలో తేలిన అక్రమ కట్టడాలను, లేఅవుట్లను జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ సహకారంతో కూల్చివేసి, భూమిని ప్రభుత్వం తన స్వాధీనంలోకి తీసుకోవాలి.
- సహకరించిన అధికారులపై విజిలెన్స్ విచారణ: గతంలో నకిలీ పత్రాల ఆధారంగా ఎన్ఓసి లు ఇచ్చిన, మ్యుటేషన్లు చేసిన రెవెన్యూ అధికారులపై విజిలెన్స్ విచారణ జరిపి, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.


**2. తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం, 1864 ప్రకారం ఆర్థిక వేటు:**

ప్రభుత్వానికి, బ్యాంకులకు కలిగించిన రూ. 800 కోట్ల ప్రజా ధనం నష్టాన్ని రికవరీ చేయడానికి ఈ చట్టాన్ని ఉక్కుపాదంతో అమలు చేయాలి:

సెక్షన్ 5 & 8 (ఆస్తుల జప్తు): దేప భాస్కర్ రెడ్డి ప్రభుత్వ భూమిని అక్రమంగా అమ్మి సంపాదించిన సొమ్మును ప్రభుత్వ బకాయిగా పరిగణించి, అతని మరియు అతని కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలను తక్షణమే నిలిపివేయాలి. వారి చరాస్తులను జప్తు చేయాలి.
- సెక్షన్ 25, 26 & 36 (బహిరంగ వేలం): నిందితుడి పేరున ఉన్న ఇళ్లు, వాణిజ్య సముదాయాలు వంటి స్థిర ఆస్తులను జప్తు చేసి, వాటిపై అతనికి ఎటువంటి హక్కులు లేకుండా చేయాలి. ఆ ఆస్తులను బహిరంగ వేలం వేయడం ద్వారా ప్రభుత్వ సొమ్మును ఖజానాకు రికవరీ చేయాలి.
- సెక్షన్ 48 (సివిల్ జైలు): నిందితుడు ఆస్తులను దాచిపెట్టినా లేదా మోసపూరితంగా బదిలీ చేసినా, కలెక్టర్ గారు స్వయంగా వారెంట్ జారీ చేసి దేప భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేయించి సివిల్ జైలుకు పంపాలి.

### ఇకనైనా కళ్ళు తెరుస్తారా?

- 2024 లోనే ఈ కుంభకోణంపై ఫిర్యాదులు అందినప్పటికీ, 2026 జూన్ వరకు కాలయాపన జరగడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక ఉన్నతాధికారుల ఉదాసీనత ఉందా? అనే అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. ఓ పత్రికా ప్రతినిధి సేకరించిన పూర్తి ఆధారాలు, ఆర్డీఓ నివేదికలు ఇప్పుడు జిల్లా కలెక్టర్ టేబుల్ పై ఉన్నాయి.
- రూ. 800 కోట్ల ప్రజా ఆస్తిని రక్షించడానికి, ప్రత్యేక ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు ద్వారా నిందితులపై క్రిమినల్ విచారణను వేగవంతం చేసి, తక్షణమే అధికారిక ప్రొసీడింగ్స్ విడుదల చేయాలి. నకిలీ ఫ్రీడమ్ ఫైటర్ల పేరిట దోపిడీకి తెరలేపిన ప్రధాన నిందితుడు దేప భాస్కర్ రెడ్డిని, అతనికి వెన్నుదన్నుగా నిలిచిన అవినీతి అధికారులను కటకటాల్లోకి నెట్టినప్పుడే ప్రభుత్వ భూములకు రక్షణ ఉంటుంది, చట్టంపై సామాన్యుడికి నమ్మకం నిలుస్తుందని సామజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ అన్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా తూతూమంత్రం చర్యలకు స్వస్తి చెప్పి, తక్షణమే ఉక్కుపాదం మోపుతారో లేదో వేచి చూడాల్సిందే.



# పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి

**- మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట-కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రేపు పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులోని ప్యాకేజీలను పరిశీలించుకుంటూ వచ్చిన అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సీఎం రేవంత్ పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్లను పరిశీలించనున్నారు. గురువారం మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కాట్రావుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు. సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ్ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1 ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్-1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ప్రదర్శించారు. ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

# అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

**- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం - గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం**

**- రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు**

**- అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.

### అమరావతికి ఐకానిక్‌గా 'అమరావతి ఐ'

లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### రాజధాని నిర్మాణ పనులకు ఊతం

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' (వీబీజి-రామాజీ) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

### కొత్త పాలసీలతో ప్రగతి పథం

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు. బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు. అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

### వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ఏ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

### ఇతర కీలక నిర్ణయాలు

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం. అంతర్జాతీయ యోగా దినోత్సవం: జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు. భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం.

రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. టీడీపీ కార్యాలయాలకు భూమి: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

**- 3 అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధం**

**- 20కిపైగా దుకాణాలు దగ్ధం.**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ సిటీ నడిబొడ్డు అమీర్‌పేటలో మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. అవి ఆర్పేలోపు మొత్తం ఆ బిల్డింగ్‌లో ఉన్న అని దుకాణాలకు వ్యాపించాయి. చుట్టుపక్కల షాపులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. భారీగా ఎగసిపడుతున్న మంటలు కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణానికి అంటుకోవడంతోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. మొత్తం బిల్డింగ్ మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోయింది. భగభగ మండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం అగ్నిమాప సిబ్బంది భయపడిపోయారు.

### 20కిపైగా దుకాణాలు దగ్ధం.

బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురి చేశాయి. మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిద అయ్యింది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. వీటిలో 20కిపైగా షాపులు కాలిబూడిదైనట్టు తెలుస్తోంది. మండే ఎండలకు మంటలు చుట్టుపక్కల ఉన్న షాపులకు వ్యాపించాయి. మంటల ధాటికి చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు అందరూ వారి షాపుల్లోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి అక్కడి నుంచి పరుగులు తీశారు.

### భారీగా ట్రాఫిక్ జామ్

విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. కేఎస్ఆర్ ఫ్యాషన్స్ షాపులో అన్నీ దుస్తులు కావటంతో మంటల స్థాయిలో తీవ్రంగా ఉందంటున్నారు అధికారులు. పొగ, మంటలు కారణంగా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మార్గంలో వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ట్రాఫిక్‌ను నియంత్రించారు.

# 2029 ఎన్నికలే టార్గెట్

**- మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?**

- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు
- గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే అత్యంత కీలకమైన నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోందని.. ఇందుకు సంబంధించి ఓ కొత్త బిల్లును తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని సమాచారం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా దేశంలోని పార్లమెంటు నియోజకవర్గాల సరిహద్దులు పూర్తిగా మారనున్నాయి. అయితే దీనిపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందుగా రాజకీయ పార్టీల మధ్య ఒక ఏకాభిప్రాయాన్ని తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఈ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును చట్టంగా మార్చే ముందు దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు, కీలక భాగస్వాములతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే దక్షిణాదికి చెందిన డీఎంకే, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సహా పలు ఇతర ప్రాంతీయ పార్టీలతో కేంద్ర ప్రతినిధులు చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల ప్రక్రియ అత్యంత కీలకమైన సమయంలో జరుగుతోంది. ప్రస్తుతం దేశంలోని లోక్‌సభ స్థానాల కేటాయింపు అనేది 1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేయబడింది. ప్రస్తుత లోక్‌సభలో 543 మంది ఎన్నికైన సభ్యులు ఉండగా, ఈ రాజ్యాంగపరమైన గడువు ముగిసిన తర్వాత పునర్విభజన చేపడితే రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యంలో పెద్ద ఎత్తున మార్పులు రావడం ఖాయం. జనాభాను విజయవంతంగా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ పునర్విభజన ప్రక్రియపై మొదటి నుంచీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. జనాభా నియంత్రణ పాటించినందుకు తమకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గిపోయి, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగితే అది తమకు జరిగే అన్యాయమని ఇక్కడి పార్టీలు వాదిస్తున్నాయి. ఈ ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించిందని.. అందుకే అందరికీ ఆమోదయోగ్యమైన, సమతుల్యమైన ఒక కొత్త ఫార్ములాను రూపొందించే పనిలో పడిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన అనేది దేశంలో రాజకీయంగా ఎలాంటి వివాదాలకు దారితీయకుండా, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుతూ, న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేలా ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రాంతీయ పార్టీలతో ఇప్పటివరకు జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని, చట్టాన్ని ముందుకు తీసుకెళ్లే ముందే ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. అన్ని పార్టీల మధ్య ఓ స్పష్టమైన అవగాహన, ఒప్పందం కుదిరిన వెంటనే కేంద్రం ఈ బిల్లుపై తదుపరి అడుగులు వేయనుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు దేశంలో జరగబోయే అత్యంత ప్రభావవంతమైన రాజకీయ, రాజ్యాంగపరమైన ప్రక్రియలలో ఈ నియోజకవర్గాల పునర్విభజన ఒకటి కానుంది. ఇది దేశ పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని, కేంద్ర-రాష్ట్రాల సంబంధాలను, దేశ భవిష్యత్తు ఎన్నికల ముఖచిత్రాన్ని శాసించే అవకాశం ఉంది.

# రాజ్యసభ సీట్లపై తేలిన లెక్క

**- టీడీపీ 3, జనసేన 1.. బీజేపీకి నో ఛాన్స్**

**- ఏపీలో 3 భారీ బహిరంగ సభలకు షెడ్యూల్ ఖరారు**




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ స్థానాల కేటాయింపుపై కూటమి పార్టీల మధ్య క్లారిటీ వచ్చింది. ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలలో టీడీపీ 3, జనసేన పార్టీ 1 సీటు తీసుకోనున్నాయి.

ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. గురువారం రోజున ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎన్డీఏ నేతల భేటీ జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటుగా జనసేన నేత నాదెండ్ల మనోహర్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో రాజ్యసభ సీట్ల కేటాయింపుతో పాటుగా కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తి కావొస్తున్న సందర్భంపై చర్చించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో టీడీపీ 3, జనసేన 1 సీటు తీసుకోనున్నట్లు కూటమి పార్టీలు ప్రకటించాయి. దీంతో ఈసారికి బీజేపీకి రాజ్యసభ సీటు లేదని క్లారిటీ వచ్చింది.

మరోవైపు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా టీడీపీ ఎంపీ సానా సతీష్ పదవీ కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎన్డీఏ కూటమి నేతలు భేటీయై ఎవరెన్ని సీట్లు తీసుకోవాలనే దానిపై చర్చించారు. గతంలో బీజేపీకి రెండు రాజ్యసభ స్థానాలు కేటాయించిన నేపథ్యంలో పార్టీ నుంచి వస్తున్న ఒత్తిడి దృష్ట్యా ఈసారి అవకాశం అడగొద్దని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే బీజేపీని కోరినట్లు సమాచారం. బీజేపీ నుంచి ఆర్. కృష్ణయ్య, పాకా సత్యనారాయణకు గతంలో అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈసారికి బీజేపీకి అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేల సంఖ్యా బలంగా ఆధారంగా నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమి పార్టీలు హస్తగతం చేసుకోనున్నాయి. ఈ నాలుగింటిలో మూడు టీడీపీ, ఒకటి జనసేన ఖాతాలోకి వెళ్లనున్నాయి. ఇక రాజ్యసభ పదవి కోసం రెండు పార్టీలలోనూ ఆశావహులు భారీ సంఖ్యలో ఉన్నారు. టీడీపీ విషయానికి వస్తే దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీష్ బాబు వంటి నేతలు రాజ్యసభ స్థానాన్ని ఆశిస్తున్నారు. జనసేనలో లింగమనేని రమేష్, బండారు నరసింహారావు వంటి నేతలు రాజ్యసభ బెర్తు కోరుకుంటున్నారు. అయితే రాజ్యసభ అభ్యర్థులు ఎవరనే దానిపై టీడీపీ, జనసేన పార్టీలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నాయి.

## పోలేరమ్మ దేవాలయంను తనిఖీ చేసిన
# మఠాధిపతి వేంకటాద్రిస్వామి



**బ్రహ్మంగారి మఠం** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం అనుసంధానమైన శ్రీ కనుమ పోలేరమ్మ వారి దేవస్థానమును గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసిన మఠం మఠాధిపతులు  వీర ధర్మజ వేంకటాద్రి స్వాములవారు.శ్రీ పోలేరమ్మ దేవస్థానం మరియు పరిసర ప్రాంతాలు అన్నిటిని కూడా పరిశీలించి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు.అనంతరం దేవస్థానంలో ఉన్నటువంటి సీసీ కెమెరాలు కూడా స్వామివారు పరిశీలించారు.అనంతరం అక్కడ నూతన నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు పరిశీలించి అతి త్వరలో భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని మేనేజర్ ని ఆదేశించారు.

## ట్రిపుల్ ఐటీల్లో 5 నుంచి
# ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

**- 12న ఎంపిక జాబితా విడుదల.**

**కడప** ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 5 నుంచి ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ అమ రేంద్రకుమార్ సండ్రా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణను ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్లో నిర్వహించేందుకు షెడ్యూల్ చేశామన్నారు.

ఈ నెల 5, 6, 8 తేదీలలో ప్రత్యేక కేటగిరీ కింద 2453 అభ్యర్థుల్లో ఎన్సీసీ 1289, స్పోర్ట్స్ 450, బీఎస్ 282, సీఏపీ 237, దివ్యాంగులు 195 మంది ఉన్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు కలిపి రిజర్వేషన్ ప్రాతిపదికన మెరిట్ జాబితాను తయారు చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రవేశాలకు సంబంధించిన ఎంపిక జాబితాను ఈ నెల 12వ తేదీన విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

## ముగిసిన మజ్జిగ వితరణ
# చలివేంద్రం కార్యక్రమం



**ఆళ్లగడ్డ** వేసవికాలం సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గత ఏప్రిల్ 24న ఆళ్లగడ్డ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రారంభమైన మజ్జిగ వితరణ కార్యక్రమం ప్రతి గురువారం మరియు ఆదివారం రోజుల్లో కొనసాగుతూ  గురువారం జూన్ 4వ తేదీన ముగిసినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం కు సత్యసాయి సేవా సంస్థలు నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి  జ్ఞాపిక అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ కృష్ణ, డా సుబ్బారావు, డా నరేంద్ర దేవ్ సత్యసాయి సేవాదళ్ సభ్యులు ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి**

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్(- ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష**

**రాజన్న సిరిసిల్ల** జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## అరుదైన యురాలజీ ఆపరేషన్ చేసిన కేజీహెచ్ డాక్టర్లు

కింగ్ జార్జి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ యురాలజీ విభాగం హెడ్ డా.ఐ. చంద్రశేఖర్ మరియు ఆయన వైద్య బృందం విజయవంతంగా చేశారు.వివరాల లోకి వెళ్ళితే, టి.రజని అనే 37 సంవత్సరాల వయస్సు గల విజయనగరం జిల్లా కు చెందిన యువతి ఒక సంవత్సరం నుండి కడుపు ఉబ్బి పోవడం, కడుపు నొప్పితో బాధ పడుతున్నది. ఆమె కింగ్ జార్జ్ హాస్పిటల్ లో యూరాలజి విభాగం లో తేది: 14.05.2026 న అడ్మిట్ అయ్యారు. ఆమెకు ఆసుపత్రి లో వివిధ రకాల వైద్య పరీక్షల జరపగా ఆమె కు, కడుపులో అడ్రినల్ గ్రంధిలో కుడివైపు 6 సెంటి మీటర్లు, ఎడమవైపు 28 సెంటి మీటర్ల కణితి ఉన్నట్టుగా గుర్తించారు. ఈ రకమైన వ్యాధి ఒక లక్ష మందిలో నలుగురికి మాత్రమె వస్తుంది. దీనిని బైలాటరల్ అడ్రినల్ మైలోలిపోమా విత్ కంజెనిటల్ అడ్రినల్ హైపర్ ప్లాసియా వ్యాధి గా గుర్తించారు. ఐఉఊ యూరాలజీ విభాగాధిపతి డా.ఐ. చంద్రశేఖర్ అద్వైర్యములో యూరాలజీ వైద్య బృందం తేది.19.05.2026 న ఆమెకు శస్త్ర చికిత్స చేసారు. పేషెంట్ ఆరోగ్యం నిలకడ ఉంది.ఈ సంధర్భం గా కె జి హెచ్ సూపరింటెండెంట్ డా.ఐ. వాణి, యూరాలజీ మరియు అనస్తీషియా వైద్య బృందాన్ని అభినందించారు.ఐ.వాణి  సహకారం తో ఈ ఆపరేషన్ సమర్ధవంతంగా పూర్తి చేసారు. ఈ ఆపరేషన్ లో అనస్తీషియా విభాగం నుండి డా. కే. శ్రీలక్ష్మి హెడ్ అఫ్ డిపార్టుమెంటు అనస్తీషియా మరియు డా. శరత్ చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్, యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.అప్పలరాజు, డా. వెంకట కృష్ణ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డా. దత్తాత్రేయ సేవలందించారు. పేషంట్ రజని పూర్తి ఆర్యోగ్య వంతంగా ఈ రోజు డిశ్చార్జ్ అవుతున్నారు.ఈ అరుదైన ఆపరేషన్ కు ముందుగా ఎండోక్రినాలజీ టీం మేనేజ్మెంట్ చేయడం వలన ఈ అరుదైన ఆపరేషన్ పూర్తి చేసామని యూరాలజీ హెడ్ ఆఫ్ డిపార్టుమెంటు డా. చంద్రశేఖర్ తెలియ చేసారు. తనకు తిరిగి జన్మనిచ్చిన వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు

## రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు
# గ్రహీతలకు సన్మానం

**- రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీత హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ కు సన్మానం.**
**- కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఏఎస్ఐ బి.సంపత్.**

**కరీంనగర్** రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవ అవార్డు గ్రహీతలు హుజురాబాద్ టౌన్ సిఐ టీ. కరుణాకర్, కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఇటీవల బదిలీ పై వచ్చిన ఏఎస్ఐ బి.సంపత్ లను టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలోహుజురాబాద్ బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, బీసీ ముద్దు బిడ్డ టీ.కరుణాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవ పోలీసు అవార్డును అందుకోవడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ హుజురాబాద్ కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో రెపరెపలాడించిన వారి సేవలను కొనియాడినారు. ముఖ్యంగా సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సముచితమైనటు వంటి న్యాయముజరుగునట్లు చూడవలసిన గురుతరమైన టువంటి బాధ్యత వారిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేసినారు. అదేవిధంగా తమ విధిని చట్ట ప్రకారము  నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాన్ని చూరగొనే విధంగా ఇంకా రెట్టింపు సేవలను సమాజములోని అన్ని వర్గాల ప్రజలకుఅందించి జాతీయస్థాయిలో ఒక ఉత్తమ పోలీస్ ఆఫీసర్గా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించినారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శిఇప్పకాయల సాగర్, శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కోడిగుడి ప్రవీణ్, హుజురాబాద్ మండలకాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్లా రాధా, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రామ్ సారయ్య, తునికి సమ్మయ్య, ప్రతాప నాగరాజు, మంచి కట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అడవులను రక్షిద్దాం - ప్రకృతిని కాపాడుదాం

**- నగరవనంలో మొక్కలు నాటిన కే. కుమార్**

**పిడుగురాళ్ల** జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని  పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా "అడవులను రక్షిద్దాం- ప్రకృతిని కాపాడుదాం" అనే నినాదంతో రాజుపాలెం మండలం దేవరంపాడు నగరవనం లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే. కుమార్ మీడియాతో మాట్లాడుతూ, అడవులను రక్షించడం, మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి దిన చర్యలో భాగం కావాలని, ప్రకృతిని నాశనం చేసుకుంటే ఈ భూమ్మీద జీవం అనే ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను నాటండి ప్రకృతిని పరిరక్షించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్ర



**చాగలమర్రి** కార్యకర్తలకు వెన్నంటి అండగా ఉంటానని  ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగుల  బ్రీజెంద్రారెడ్డి అన్నారు. గురువారం నేలంపాడు గ్రామంలోని  ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదని నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతే రాజని, వైయస్ జగన్ అన్న హయాంలో రైతు సంక్షేమానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందరూ కూడా రాజన్న రాజ్యం కోసం  ఎదురుచూస్తున్నారని రానున్న రోజుల్లో జగనన్న నాయకత్వమును కోరుతున్నారన్నారు. ఈయన వెంట  వైసిపి నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు ఉన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎన్.డి. విజయజ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు**



**బద్వేలు** బద్వేల్,  ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం  నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి సహాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్ కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు  ఎన్.డి. విజయజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం బద్వేల్ ఆర్ ఽ బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి ఉన్న బహుళ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు.జూన్ 5 నుండి జూన్ 14 వరకు అధికారులు సన్నాహక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలోని వివరాలను 2002 ఎన్నికల జాబితా మరియు కుటుంబ సభ్యుల వివరాలతో సరిపోల్చి పరిశీలించనున్నారని చెప్పారు.బద్వేల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ బూత్ స్థాయి సహాయకులను నియమించాలని, ప్రతి బీఎల్ఏ రోజుకు కనీసం 50 దరఖాస్తులను బీఎల్ఓలకు అందజేసేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా బీఎల్ఏలు రోజుకు 10 వరకు దరఖాస్తులను కూడా బీఎల్ఓలకు సమర్పించవచ్చని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇదే కాలంలో కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులను కూడా స్వీకరిస్తారని తెలిపారు.తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 22న ప్రచురించబడుతుందని చెప్పారు. ఎన్నికల నమోదు అధికారి నిర్ణయంపై అసంతృప్తి ఉన్నవారు 15 రోజులలోపు జిల్లా మేజిస్ట్రేట్‌కు లేదా 30 రోజులలోపు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి కు అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించే దిశగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని ఎన్.డి. విజయజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ అచ్యుత రాజు, బద్వేల్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, పోరుమామిళ్ల మండల పార్టీ అధ్యక్షుడు అన్వర్, జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు భాష, బి.కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు గురప్ప , బద్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ,కాశి నాయన మండల పార్టీ అధ్యక్షుడు పుల్లూరు పెద్ద కాజావలి , యూత్ కాంగ్రెస్ నాయకులు ముజాహిద్, నాయబ్ రసూల్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరుమలయ్య , తదితరులు పాల్గొన్నారు

## మారుతున్న కాలానికి అనుగుణంగా
# విద్యాబోధన ఆవశ్యకత

**- మండల విద్యాశాఖాధికారులు ఎండీ. ఖాసిం, వై. శ్రీనివాసరావు**



**పిడుగురాళ్ల** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండీ. ఖాసీం అన్నారు. పిడుగురాళ్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడవ సంవత్సరం జ్ఞాన ప్రకాష్ ఒకటి, రెండవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు, మెగా డీఎస్సీ ద్వారా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ది. 04-06-2026 నుండి 9వ తేదీ వరకు జరుగు పునాది అన్నారు. అక్షరాస్యత  సంఖ్యా జ్ఞానం (ఎఫ్ ఎల్ ఎన్ ) కింద 60 రోజుల సర్టిఫికెట్ కోర్స్ అమల్లో భాగంగా శిక్షణా కార్యక్రమం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు మెగా డీఎస్సీ 2025 ద్వారా పల్నాడు ప్రాంతంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ నియమాలు చేపట్టటం జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని తమ తమ పాఠశాలలో అమలుపరిచి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలంటే నమ్మకం ఏర్పడే విధంగా బోధించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలు, సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. శిక్షణకు సమయపాలన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక మండల విద్యాశాఖ అధికారి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను 100% ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు  కె. మల్లికార్జునరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కార్యాచరణ ఆధారిత, భాగస్వామ్య,  ఆటలాధారిత బోధనా పద్ధతులను అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ పీలు  దాసరి లూర్దు మేరీ, డిఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు

**- రుద్రవరంలో వైఎస్ఆర్సిపి భారీ నిరసన ర్యాలీ.**



**రుద్రవరం** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ రుద్రవరంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన గళం విప్పారు. వైఎస్ఆర్సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) ఆదేశాల మేరకు గురువారం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ నుండి అమ్మవారి శాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.  ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమ య్యారని గంధం రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆశలను ఆశలను అడియాసలు చేస్తోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం కూలిపోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి,, టి ఏ నరసింహారావు, హరి నారాయణ, డే గాని వెంకటేష్, జాకీర్ హుస్సేన్, పెద్దన్న,పాణ్యం చంద్ర, సవరం నాగ ముని, మాధవ, జయరాముడు, శూలం ప్రభాకర్, డిష్ భాస్కర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫుట్బాల్ లీగ్ మ్యాచ్ ను ప్రారంభించిన డి.ఎస్.పి. శ్రీనివాస రావు



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డలోని వై.పి.పీ.ఎం ప్రభుత్వ పాఠశాల  క్రీడ మైదానంలోగురువారంఏపీ స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆర్ ఆర్ .అకాడమీ నిర్వహిస్తున్న ఫుట్బాల్ సమ్మర్ కోచింగ్ పోటీలను డిఎస్పి శ్రీనివాసరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ ద్వారా మీకు ఇష్టమైన గేమ్ లో బాగా రాణించి మన ఆళ్లగడ్డకు నంద్యాల జిల్లాకి మంచి పేరు తేవాలని అలాగే జిల్లా క్రీడల పట్ల తమ పిల్లలను తల్లిదండ్రులు  ప్రోత్సహించి,శారీరికంగా మానసికంగా భవిష్యత్తులో ఉద్యోగాలలో ఆర్మీ రిజర్వ్ పోలీస్  రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలోన్యాయవాది వినోద్ కుమార్,(ఆర్ ఆర్ .అకాడమీ వైస్ ప్రెసిడెంట్) మాట్లాడుతూ ఆళ్లగడ్డలో శ్రీ సోమల రమణారెడ్డి ఆర్ఆర్ అకాడమీ గత మూడు సంవత్సరాల నుండి క్రీడలలో ప్రతిభ ఉన్న క్రీడాకారుల కోసం  వివిధ రకాల క్రీడలను లను నిర్వహించి  ఆణిముత్యాలను బయటికి తీయడమే ఆర్ఆర్ అకాడమీ యొక్క ముఖ్య లక్ష్యం అని అన్నారు. కోచ్ సుబ్బరాయుడు, మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరంలో ఆర్ఆర్ అకాడమీ నుండి క క్రికెట్, హ్యాండ్ బాల్, ఫుట్బాల్, రెజ్లింగ్ పోటీలలో శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి పోటీలలో కూడా  ఆళ్లగడ్డ నుండి ప్రతిభను ప్రదర్శించి పథకాలు సాధించిన వారు ఉన్నారు అని రాబోయే రోజుల్లో ఇంకా నైపుణ్యత మైనటువంటి శిక్షణ ఇచ్చి మంచి ఫలితాల కోసం పనిచేస్తామన్నారు. నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ ట్రెజరర్ సిద్దు మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుండి మంచి ఫుట్బాల్ క్రీడాకారులను శిక్షణ ఇచ్చి పంపించడమే మా అసోసియేషన్ యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ కోచ్ అఖిల్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, ప్రతాప్, దివాకర్, రవి, దేవేంద్ర, బాలు, శివ, నాగరాజు  ఏపీ ఎస్పీ సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారుడు శ్రీను , పాల్గొన్నారు

# పైసలు ఇస్తేనే భవన నిర్మాణ అనుమతులా.?

**- గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం గేటుకు ఫ్లెక్సీ కట్టి ప్రజల వినూత్న నిరసన**

**- అక్రమ నిర్మాణాలకు రాత్రికి రాత్రే అనుమతులు..**

**అర్హుల దరఖాస్తులు పెండింగ్‌లోనే అంటూ ఆగ్రహం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి అధికారులు రాత్రికి రాత్రే అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు ఫ్లెక్సీ కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ, అన్ని చట్టబద్ధమైన పత్రాలు సమర్పించి నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అనుమతులు ఆలస్యం చేస్తున్న అధికారులు, మరోవైపు ప్రభుత్వ భూములు మరియు వక్ఫ్ బోర్డు స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు మాత్రం వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించిన వారు, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా మంజూరైన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబా, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగా అశోక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు ఫ్లెక్సీ కట్టి నిరసన తెలపడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారనే అంశంపై పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఘనంగా కబడ్డీ బాలకృష్ణ జన్మదిన వేడుకలు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) జగదేవపూర్ మండలం కేంద్రంలోని స్థానిక శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద బి అర్ ఎస్ పార్టీ మండల విద్యార్తి విభాగం అధ్యక్షులు కబడ్డీ బాలకృష్ణ జన్మదినం సందర్భంగా స్థానిక సర్పంచ్ పనగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో బాలకృష్ణ ముందుంటాడు అని మండలం కు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన అన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని జీవితంలో ఉన్నంత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు, వార్డు సభ్యులు భాస్కర్, ఇస్మాయిల్, నాయకులు భాస్కర్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థుల గిన్నిస్ రికార్డు

**ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ముందు విద్యార్థులు సన్మానించిన వరంగల్ రవి**



తార్నాక(ప్రశ్న న్యూస్)మ్యూజిక్ కీ బోర్డు వాయించడంలో గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించిన విద్యార్థులకు ఘన సన్మానం జరిగింది. సంగీతంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు వరంగల్ రవి సన్మానించారు. హైదరాబాద్ విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన గిన్నిస్ అచీవ్‌మెంట్ మీట్‌లో రికార్డు సాధించిన మ్యూజిక్ విద్యార్థులను ఓయూలోని ఆర్ట్స్ కళాశాల ముందు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రవి.. సంగీత రంగంలో అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ రికార్డు సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు తెలంగాణకు మంచి పేరు తీసుకొచ్చారనీ. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సంగీత కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన 2 వేల మంది కీబోర్డ్ వాద్యకారులు గంటపాటు నిరంతరాయంగా ప్రదర్శన ఇచ్చారు. ఈ ఈవెంట్స్ లో పాల్గొన్న 777 మంది వాద్యకారులకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి సంస్థ సర్టిఫికెట్లు అందజేసింది. ఎంతోమందికి ఉచితంగా సంగీతాన్ని నేర్పిస్తున్న హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ డైరెక్టర్ అగస్టీన్ దండంగి ను ఈ సందర్భంగా వరంగల్ రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ అండ్ హల్లెల్ హైదరాబాద్ ఇంచార్జ్ రేమ, ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్, ప్రొఫెసర్ డైసీ, జి.నరహరి, ఎవేలిన్ గీత, మోసెస్ దేవదాస్, డి.శివాని, అమూల్య, సాల్మన్ రాజ్, శామ్యూల్ రాజ్, జేశురన్, డానియల్ రాజ్, జోయల్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకున్న తల్లి కుమారుడు



తార్నాక(ప్రశ్న న్యూస్)మల్కాజిగిరి ఆనంద్బాగ్ కు చెందిన తల్లీ, కుమారుడుకీ-బోర్డు వాయించడంలోప్రతిభ చూపి గిన్నిస్బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చోటు సంపాదించుకున్నారు. ఎవిలిన్ గీత గృహిణి.. ఆమె కుమారుడు జోయల్ లెమ్యూల్ మేల్కొండ నాలుగో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ స్థానికంగా ఉన్న ఓ మ్యూజిక్ స్కూల్లో కీబోర్డు వాయించడంలో శిక్షణపొందుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న సికింద్రాబాద్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు 22 దేశాలకు చెందిన 2 వేల మందికి కీ-బోర్డు వాయించడంపై పోటీ నిర్వహించారు. ఇందులో 777 మంది ఉత్తమ ప్రతిభావంతులనుఎంపిక చేశారు. వారికి ఇటీవల గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన 'గిన్నిస్ అచీవర్స్ మీట్ లో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

# మార్కెట్ లో చోరీ,గోవాలో ఎంజాయ్:డిసిపి శ్రీధర్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) జల్సాలకు అలవాటు పడిన వ్యక్తి చోరీలకు తెర లేపాడు. ఈజీ మనీ కోసం రాష్ట్రం ఏదైనా సరే స్కెచ్ వేస్తే చాలు చోరీ చేసిన సొమ్ముతో ఉడయిస్తూ, గోవా, భోపాల్, ఢీల్లీ ప్రాంతాల్లో ఎంజాయ్ చేస్తాడు. సికింద్రాబాద్ మార్కెట్ పీఎస్ పరిధీలో క్రితం నెల మే 27 నా "576" గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. మార్కెటు పోలీసులు రంగంలోకి దిగి మూడు బృందాలుగా ఏర్పడి, నిందితుడుని గాలించారు. ఈ నేపధ్యంలో మల్కాజిగిరి కమీషనర్ బి.సుమతి ఆదేశాలు మేరకు నూతన టెక్నాలజీతో దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు.

మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ సూచనలతో ఏసిపి యాదగిరి రెడ్డి నేతృత్వంలో "3" బృందాలు గా ఏర్పడి వేట మొదలు పెట్టారు. క్రైం చోటు చేసుకున్న సంఘటన స్థలం నుంచి ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేసిన అధికారులకు ఆశ్చర్య పోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫిర్యాదు చేసిన సాదా సీదా వ్యక్తి,గోల్డ్ పాలీష్చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్న సందీప్ రఘునాథ్ చౌహాన్. ఆయన ఇంట్లో ఇంతపెద్ద ఎత్తున బంగారం ఉండడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం, కనీసం సీసీ కెమెరాలు లేకపోవడం మార్కెట్ పోలీసులకు ఛాలెంజ్ గా మారింది. మల్కజిగిరి జోన్ డిసిపి శ్రీధర్ విలేకరుల సమావేశంలో మాట్లాడాతూ అసలు విషయం ఏమిటంటే ఢీల్లికి చెందిన మనోజ్ సింగ్ తండ్రి శ్యాం సింగ్ వయస్సు 28 సంవత్సరాలు. ఈ నేరస్థుడు చోరీలు చేసే విధానమే వేరే. ముఖ్యంగా ఇంటి ముందు "టూ లేట్"బోర్డు చూసి మాటల్లో పెట్టి చోరీకి పాల్పడుతున్నారు. మే27 నా ఢీల్లి నుంచి ఎస్ఆర్ నగర్ కాలనీ లో రెక్కీ నిర్వహించి,లాభం లేకపోవడంతో మార్కెట్ పీఎస్ పరిధీలో రెక్కీ నిర్వహించి టూ లేట్ బోర్డు ఇంట్లోకి వెళ్లి సుమారు 576 గ్రాముల బంగారం చోరీ చేసీగోవాకు పారిపోయినట్లు డిసిపి పేర్కొన్నారు. మార్కెట్ పోలీసులు గోవాలో ఉన్న మనోజ్ సింగ్ ని అదుపులోకి తీసుకుని విచారించగా చోరికి గురైన బంగారంతో పాటు మరిన్ని విషయాలు వెల్లడైయ్యాయి. పోలీసుల ఇన్వెస్టిగేషన్ లో నిందితుడు మనోజ్ సింగ్ ఢీల్లీలో 19 కేసులు నమోదయ్యాయని ,హైదరాబాద్ మహానగరంలో ఇదే మొదటి కేసుగా గుర్తించినట్లు శ్రీధర్ తెలిపారు. అలాగే ఆయనను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.

**మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్ విజ్ఞప్తి:**

మల్కాజిగిరి జోన్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తొందరగా ఎవ్వరినీ నమ్మకూడదని, మరి ముఖ్యంగా ఇంట్లో, ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, అనుమానితులు ఎవరైనా మీకు

తారసపడితే, వారి వ్యవహారం పై అనుమానం ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డిసిపి యాదగిరి రెడ్డి, మార్కెట్ ఇన్స్పెక్టర్ రాంచందర్, డి.ఐ.బషీర్ అహ్మద్, ఎస్సైలు నరేష్, ఏ.నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మెడినోవా హాస్పిటల్‌లో అరుదైన కిడ్నీ శస్త్రచికిత్స విజయం

**పుట్టుకతో వచ్చిన లోపంతో పాటు పెద్ద రాయి (స్టాగ్ హార్న్) గుర్తింపు**

**ఒకేసారి మూడు ఆపరేషన్లు చేసి రోగి ప్రాణాలు కాపాడిన డాక్టర్ బి నితేష్ బృందం**





మేడ్చల్( ప్రశ్న న్యూస్) పుట్టుకతో వచ్చిన కిడ్నీ లోపంతో పాటు తీవ్రమైన అంతర్గత సమస్యలతో బాధపడుతున్న ఒక యువకుడికి మేడ్చల్ పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. స్థానికంగానే కార్పొరేట్ స్థాయి అత్యాధునిక వైద్యం అందించి రోగికి పునర్జన్మ ప్రసాదించారు. హాస్పిటల్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణానికి చెందిన నవీన్ చారి (37) అనే యువకుడు ఎడమ వైపు నడుము, పొత్తికడుపు నొప్పితో బాధపడుతూ మెడినోవా హాస్పిటల్‌ను ఆశ్రయించారు. హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు జనరల్ సర్జన్ డాక్టర్ బి.నితేష్ రోగికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగికి పుట్టుకతోనే ఎడమ కిడ్నీ నుండి ఒకటికి బదులు రెండు మూత్రనాళాలు ఉండటం వల్ల మూత్ర ప్రవాహానికి తీవ్ర అడ్డంకి ఏర్పడింది. దీనికి తోడు, అదే కిడ్నీలో మూత్రాన్ని సేకరించే భాగాన్ని పూర్తిగా అడ్డుకుంటూ పెద్ద పరిమాణంలో ఉన్న 'స్టాగ్ హార్న్' రాయి పేరుకుపోయింది. దీంతో పరిస్థితి తీవ్రతను గమనించిన డాక్టర్ బి.నితేష్ నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం రోగి ప్రాణాలను కాపాడేందుకు సుదీర్ఘమైన శస్త్రచికిత్స చేపట్టారు. ఓపెన్ పైలోలిథోటమీ ద్వార కిడ్నీలో ఉన్న భారీ స్టాగ్ హార్న్ రాయిని సురక్షితంగా తొలగించారు. ఆండర్సన్-హైన్స్ పైలోప్లాస్టీ ద్వార పుట్టుకతో వచ్చిన లోపాన్ని సరిచేస్తూ, అదనంగా ఉన్న రెండో మూత్రనాళాన్ని తొలగించి ప్రవాహ అడ్డంకులను తొలగించారు. డీజే స్టెంటింగ్ తో అంతర్గత వ్యవస్థ సజావుగా సాగడానికి తాత్కాలికంగా స్టెంట్ అమర్చారు. ఆపరేషన్ అనంతరం వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణ, నొప్పి నివారణ చికిత్సతో రోగి వేగంగా కోలుకున్నారు. ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడటంతో ఆయనను హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఒకే రోగిలో పుట్టుకతో వచ్చిన లోపంతో పాటు, కిడ్నీని పూర్తిగా మూసివేసే అంత పెద్ద రాయి ఏర్పడటం చాలా అరుదు. ఈ క్లిష్ట పరిస్థితిని మా వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, ఒకేసారి మూడు శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశాం. మేడ్చల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇలాంటి అత్యాధునిక కిడ్నీ సంబంధిత వైద్య సేవలను మెడినోవా హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చామని డా. బి నితేష్, ప్రముఖ యూరాలజీ నిపుణులు పేర్కొన్నారు.

# తెల్లవారంగానే ఊరిలో అధికారులు మొద్దు నిద్రలో ప్రజలు

**సమాచారం ఇవ్వలేదా సమస్యలు అక్కర్లేదా.?**




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామం, వార్డులో సభలు నిర్వహించి, ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించాలని, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశాలు ఉండడంతో సంబంధిత అధికారులు తెల్లవారంగానే గ్రామాల్లోకి చేరుకుంటున్నారు. కానీ, ప్రజలకు సమాచారం అందకనో, సమస్యలే లేవు అనుకుంటున్నారో, మాకు ఎందుకు అనుకుంటున్నారో తెలియదు కానీ సమావేశం వైపు కన్నెత్తి చూడడం లేదు. వెంకటాపూర్ గ్రామంలో 2776 మంది ఓటర్లు ఉండగా 10 మంది గ్రామస్తులు కూడా రాకపోవడం గమనార్హం. ఆ వచ్చిన కొద్దిమంది కోసం విజయవంతంగా సభను కొనసాగించారు తహశీల్దార్ సుజాత. గ్రామ సభ వేదికగా పంటల మార్పిడి, ఆయిల్ పామ్ సాగు, ఫార్మర్ రిజిస్ట్రీ, సన్న వడ్ల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు వ్యవసాయ శాఖ అధికారులు.

లాభదాయక పంటగా ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి తెలియజేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు చేయాలని, కంపోస్ట్ షెడ్లను సక్రమంగా నిర్వహించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు ముందుగానే గుంతలు సిద్ధం చేయడంతో పాటు నర్సరీల నిర్వహణ, ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. సభలో బడి బాట కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యాసంస్థల పునఃప్రారంభానికి ముందే పరిశుభ్రత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

జనగణన నిర్వహణలో ఛార్జ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయి అవగాహన ఉండేలా చూడాలని తహశీల్దార్ సుజాత తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే షెడ్యూల్ ప్రకారం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం అన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు కలిగే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపిస్తే సరిపోతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

బీఎల్‌వోలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అంగన్‌వాడీ సిబ్బంది, ఆర్పీలు సహకరించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభలకు జన సమీకరణ చేపట్టాలని, ఎజెండా ప్రకారం ప్రతీ అంశంపై చర్చించాలని అన్నారు. గ్రామసభలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'పెద్ది' - మూవీ రివ్యూ!




చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు తెరకెక్కించిన సినిమానే 'పెద్ది'. ఈ కథపై కసరత్తు చేయడానికి బుచ్చిబాబు చాలా కాలమే కష్టపడ్డాడు. బుచ్చిబాబుపై నమ్మకంతో చరణ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి కూడా చాలా సమయమే తీసుకున్నాడు. స్పోర్ట్స్ డ్రామాతో కూడిన కంటెంట్ కావడం, చరణ్ – జాన్వీ కలిసి తొలిసారిగా నటించిన సినిమా కావడంతో సహజంగానే అందరిలో ఆసక్తి పెరిగింది. ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన బాణీలకు మంచి రెస్పాన్స్ రావడంతో అంచనాలు పెరిగాయి. అలాంటి అంచనాల మధ్య ఈ రోజు (జూన్ 4)న ఈ సినిమా థియేటర్లకు వచ్చింది. 'విజయనగరం' జిల్లా పరిధిలోని కొండకింద ఊరు అది. అందువలన అందరూ దానిని 'కొండకింద ఊరు' అనే పేరుతోనే పిలుస్తుంటారు. అంతకు మించి ఆ ఊరుకంటూ ఒక పేరు లేదు. 450 కుటుంబాల వారు కలిసి నివసించే ఈ ఊరులో ఎవరికీ ఓటు హక్కు అనేది లేదు. ఆ ఊరు మీదుగా వెళ్లే ట్రైన్ అక్కడ ఆగదు. ఎంతదూరమైనా వాళ్లు కాలిబాటలో వెళ్లాల్సిందే. ఆ ఊళ్లో రైలు ఆగేలా చేయడం కోసం, 30 ఏళ్లుగా 'అప్పల సూరి' (జగపతిబాబు) ప్రయత్నిస్తూ ఉంటాడు. గవర్నమెంటు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటాడు. కొండకింద ఊరుకి చెందిన యువకుడే 'పెద్ది'. తన తల్లితో కలిసి అతను అక్కడ నివసిస్తూ ఉంటాడు. 'బెల్లం బట్టీ'లో పనిచేసే పెద్ది, 'ఆటకూలి'గా క్రికెట్ ఆడుతూ ఉంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో అతనితో సమానమైన ఆటగాడు లేడని అంతా చెప్పుకుంటూ ఉంటారు. అది ఆ ప్రాంతంలోని కలవారి కుటుంబాలకు చెందిన యువకులకు అసూయగా కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రాంతంలో రాజకీయనాయకుడైన సుభద్రరాజు (రావు రమేశ్) కూతురైన అచ్చియమ్మ (జాన్వీ కపూర్)పై 'పెద్ది' మనసు పారేసుకుంటాడు. కొండకింద ఊరులో రైలు ఆగేలా చేయడం కోసం 'సూరి' ప్రాణత్యాగం చేస్తాడు. అతని మరణం పెద్దిని కలవరపెడుతుంది .. ఆలోచింపజేస్తుంది. ఒక మనిషికైనా .. గ్రామానికైనా గుర్తింపు ఎంత అవసరమనేది అతనికి అర్థమవుతుంది. తన గ్రామానికి గుర్తింపు రావాలంటే ముందుగా తాను గుర్తింపును సంపాదించుకోవాలి. అది జరగాలంటే తాను ఎంచుకున్న రంగంలో తాను గెలవాలి అని నిర్ణయించుకుంటాడు. అందుకోసం పెద్ది చేసే పోరాటమే ఈ సినిమా కథ. పాతికేళ్లకే పాతబడి పోవద్దు.. చేసేదేమైనా ఉంటే ఇప్పుడే చేసేయి .. నిదానంగా చేయొచ్చులే అని తాపీగా కూర్చోవడానికి మళ్లీ పుడతామా ఏంటి? అనే ఆలోచనా విధానంతో ఉండే ఒక కొండ ప్రాంతానికి చెందిన యువకుడి కథ ఇది. ఆట అనేది డబ్బుల కోసం కాదు .. పేరు కోసం ఆడాలి. అప్పుడే అది తన ఊరుకి కూడా గుర్తింపును తెస్తుందని తెలుసుకుని, ఆ దిశగా పోరాటాన్ని సాగించిన ఒక యోధుడి కథ ఇది. దర్శకుడు బుచ్చిబాబు ఈ స్పోర్ట్స్ డ్రామాలో మూడు ఆటలను టచ్ చేశాడు. క్రికెట్ .. కుస్తీ .. పరుగు పందాలను చూపిస్తూ వెళ్లాడు. నిజానికి ఒక కథలో ఈ మూడు అంశాలను ఆసక్తికరంగా ఆవిష్కరించడం కత్తిమీద సామువంటిదే. అయినా భారీస్థాయిలో అందుకు సంబంధించిన సన్నివేశాలను ఆవిష్కరిస్తూ వెళ్లాడు. ఎమోషనల్ గా కనెక్ట్ చేస్తూ వెళ్లాడు. అయితే ఉన్న సమయమంతా ఆటలకే సరిపోవడంతో, లవ్ .. రొమాన్స్ .. ఇతర వినోదపరమైన అంశాలకు చోటు లేకుండా పోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. బుచ్చిబాబు చేసిన మరో సాహసం ఏమిటంటే ఒక పవర్ఫుల్ విలన్ అంటూ లేకుండా, కథానాయకుడి చుట్టూ ఉన్న పరిస్థితులనే విలన్ గా చూపిస్తూ వెళ్లడం. దాంతో హీరోకి ఏ వైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే ఒక టెన్షన్ లేకుండా ఆడియన్స్ కూల్ గా చూస్తుంటారు. ఇక జాన్వీ కపూర్ పాత్ర తెరపై అక్కడక్కడా కాకుండా, అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తుంది. ఆమె పాత్రపై ఏ మాత్రం ఫోకస్ పెట్టకపోవడం కనిపిస్తుంది. ఐటమ్ సాంగ్ కి ముందు .. వెనుక అన్నట్టుగా ఉంటుంది ఆమె పాత్ర ధోరణి. హీరోతో ప్రేమ వ్యవహారం పెద్దగా ముదరకుండానే, ఆమె అతని పేరు చెప్పి 'తాళి' కట్టేసుకోవడం ప్రేక్షకులు బిత్తరపోయేలా చేస్తుంది. రావు రమేశ్ లాంటి ఆర్టిస్టు కూడా, తెరపై ఆమె తండ్రి అనిపించుకుని వెళ్లిపోవడం ఆశ్చర్యం. తెరపై అప్పటికప్పుడు పుట్టుకొచ్చి ఆ తరువాత అదృశ్యమైపోయే పాత్రలు చాలానే కనిపిస్తాయి. ఒకటి రెండు చిన్న పాత్రలను హైలైట్ చేసిన బుచ్చిబాబు, మరికొన్ని ముఖ్యమైన పాత్రలను వదిలేశాడు. చరణ్ పాత్రను డిజైన్ చేసిన విషయంలో మాత్రం ఆయనను అభినందించవలసిందే. చరణ్ ఎంతగా కష్టపడ్డాడనేది మాత్రం ప్రతి ఫ్రేమ్ చెబుతూనే ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో జగపతిబాబు .. శివరాజ్ కుమార్ పాత్రలు మినహా ఎవరూ పెద్దగా ప్రభావితం చేయలేకపోయారు. శ్రుతి హాసన్ స్పెషల్ సాంగ్ విజిల్స్ కొట్టించలేకపోయింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. తెరపై రత్నవేలు ఆవిష్కరించిన దృశ్యాలు ఆకట్టుకుంటాయి. ఏఆర్ రెహ్మాన్ సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలం అనే చెప్పాలి. నవీన్ నూలి ఎడిటింగ్ కూడా మంచి మార్కులు కొట్టేస్తుంది. యాక్షన్ సీక్వెన్స్ ను డిజైన్ చేసిన తీరు .. కొరియోగ్రఫీ గొప్పగా అనిపిస్తాయి. సందర్భాను సారంగా అక్కడక్కడా కొన్ని డైలాగులు మనసును పట్టుకుంటాయి. 'నీకంటూ ఒక గుర్తింపు దక్కాలంటే నీ గెలుపు కనిపించాలి . లేదంటే ఆ గెలుపు శబ్దం వినిపించాలి. అంతవరకూ నువ్వు పరిగెడుతూనే ఉండాలి' అనే ఒక సందేశాన్ని ఇచ్చిన తీరు బాగుంది. అయితే ఆటలకి సంబంధించిన కోటా పెరిగి పోయి, లవ్ .. రొమాన్స్ .. మాస్ ఆడియన్స్ ఆశించే వినోదం వాటా తగ్గడం కాస్త అసం తృప్తిని కలిగిస్తుంది. ఫ్యామిలీ ఆడియన్స్ మొగ్గు చూపితే, చరణ్ పడిన కష్టం ఫలించినట్టే అవుతుంది.



## డాక్టర్ బయోపిక్‌లో సూర్య?

ఇటీవల విడుదలైన 'కరుప్పు'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు తమిళ అగ్ర హీరో సూర్య. ఇప్పటికే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300కోట్ల మైలురాయిని దాటింది. గత కొంతకాలంగా సరైన విజయాలు లేక సతమతమవుతున్న సూర్య కెరీర్‌కు 'కరుప్పు' మంచి ఊపునిచ్చింది. ఈ నేపథ్యంలో సూర్య కొత్త సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. తనకు 'జై భీమ్' వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో సూర్య మరో సినిమా చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి.తాజా సమాచారం ప్రకారం ఇదొక డాక్టర్ బయోపిక్ అని తెలిసింది. చెన్నైలో ఛాతీ వైద్యుల నిపుణుడిగా, పేదల పాలిట పెన్నిధిగా ప్రసిద్ధికెక్కిన డాక్టర్ కృష్ణ వరదాచారి తిరువేంగడం జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కేవలం 5 రూపాయల ఫీజుతో పేదప్రజలకు వైద్యాన్నందించి సేవా గుణాన్ని చాటుకున్నారు డాక్టర్ కృష్ణ వరదాచారి. వైద్యపరంగా ఆయన సేవలకుగాను పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆరేళ్ల క్రితం కన్నుమూసిన ఈ లెజండరీ డాక్టర్ జీవితంలోని ముఖ్యఘట్టాలను తీసుకొని సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం.

## తండ్రి తాలూకు ప్రపంచం



రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఆధ్యాత్మిక భావాల్ని ప్రతిబింబించే టైటిల్‌తో తండ్రీకూతుళ్ల అనుబంధం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటమే అందుక్కారణం. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. బుధవారం 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. కూతురే ప్రపంచంగా బతికే తండ్రీ, వారిద్దరి మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ హృద్యంగా సాగింది. అయ్యప్పదీక్ష తాలూకు విజువల్స్ భావోద్వేగభరితంగా అనిపించాయి. యాక్షన్ ఎలిమెంట్స్ కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఓ తండ్రి తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ గ్లింప్స్ హార్ట్‌టచింగ్‌గా సాగింది. ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.

## ఇప్పటివరకూ రాని కథ!



లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న సంగీతప్రధాన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపూడి ప్రధాన పాత్రధారులు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక అహల్యా బమ్రూ విలేకరులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ భాషలు మాట్లాడే ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ చూసి నాగ్‌అశ్విన్ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను' అని చెప్పింది. ఈ సినిమాలో తాను బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో విలన్ క్యారెక్టర్‌లో కూడా అమ్మాయే నటించిందని తెలిపింది. 'కథాపరంగా కూడా ఇది కొత్త జోనర్ సినిమా. ఇలాంటి కథను ఇంతవరకు చూసి ఉండరు. తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఆనందంగా ఉంది. మహేష్‌బాబు నా ఫేవరేట్ హీరో. యాక్షన్ సినిమాలు చేయాలన్నది నా డ్రీమ్' అని అహల్యా బమ్రూ చెప్పింది.

## గండికోటలో 'రణబాలి'

అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. రష్మిక మందన్న కథానాయిక. రాయలసీమ నేపథ్యంలో జరిగే ఈ కథలో విజయ్ దేవరకొండ 19వ శతాబ్దం నాటి చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా ఆయన పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు.ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లా గండికోటలో జరుగుతున్నది. కోట ముఖద్వారం, ధాన్యాగారంలో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవారం రోజుల పాటు అక్కడే షూటింగ్ జరుగుతుందని తెలిసింది. 'రణబాలి' సెప్టెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.



## థియేటర్లలో రూ.1800 కోట్ల కలెక్షన్లు.. ఈరోజే ఓటీటీలోకి 'ధురంధర్ 2!




ఇండియన్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో రూ. 1800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో సంచలన విజయం సాధించిన ఈ చిత్రం, ఈరోజు సాయంత్రం నుంచే డిజిటల్ వేదికపైకి రానుంది. భారత్‌లో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జియో హాట్‌స్టార్' వేదికగా ఈ రోజు రాత్రి 7 గంటలకు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ ప్రదర్శితం కానుంది, అలాగే జూన్ 5 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉంటుంది. థియేటర్లలో కట్ చేసిన కొన్ని సీన్స్, అన్‌ఫిల్టర్డ్ డైలాగ్స్‌తో కూడిన ప్రత్యేక వెర్షన్ కట్‌ను భారత్‌లో జియో హాట్‌స్టార్ స్ట్రీమింగ్ చేస్తుండటం విశేషం. దీనికి ముందు సాయంత్రం ఒక 30 నిమిషాల బిహైండ్-ది-సీన్స్ ప్రీ-షో కూడా ఉండనుంది. ఇక విదేశాల్లోని సినీ అభిమానుల కోసం ఈ మూవీ ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. ఆదిత్య ధార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హై-వోల్టేజ్ స్పై థ్రిల్లర్‌లో రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించారు. థియేటర్లలో మిస్ అయిన వారు లేదా మరోసారి ఈ యాక్షన్ విజువల్ ఫీస్ట్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారు ఈరోజు సాయంత్రం నుంచి ఓటీటీలో చూసేయొచ్చు.

# శ్రామిక ప్రజల హక్కులకై పోరాడుదాం

**సీతంపల్లిలో కార్మిక కర్షక సదస్సు.**

**జిల్లా కార్యదర్శి బూడిద గణేష్**



మంథని ( ప్రశ్న న్యూస్) ముత్తారం మండలం సీతంపల్లి గ్రామంలో సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక స్థితిగతులు అనే అంశంపై సదస్సు జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ గ్రామంలో రైతులు వ్యవసాయ కూలీలు కార్మికుల సమస్యలు అనేకం ఉన్నాయని అన్నారు వ్యవసాయంలో యంత్రాలు రావడం వలన కూలీలకు పని దొరకక వ్యవసాయేతర కార్మికులుగా మారి ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళుతున్నారని అన్నారు ఉపాధి హామీ పథకం స్థానంలో జిరాంజి రావడం వల్ల కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని అన్నారు రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడం లేదని డిస్కమల పేరుతో రైతుల వ్యవసాయ బోర్లకు మీటర్లు అమర్చి రైతుల మీద భారాలు వేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పెన్షన్ ప్రమాద బీమా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇండ్ల కృష్ణవేణి సది మాజీ ఉపసర్పంచ్ ఓదెలు కార్మిక సంఘం నాయకులు ఇందారపు ఎల్లయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ హమాలి కార్మిక సంఘం నాయకులు మల్లన్న బుచ్చన్న రమేష్ మరియు వ్యవసాయ వ్యవసాయ కార్మికులు దుర్గయ్య కొమురయ్య నరేష్ తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్య రక్షకులు.

**శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో.సర్పంచ్ చిందం మహేష్.**



మంథని ( ప్రశ్న న్యూస్) పన్నూర్‌లో చిందం మహేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందికి ఎగ్స్ ట్రే పంపిణీ గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ రోజు రామగిరి మండలం, పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో ఎగ్స్ ట్రే పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగిరి మండల ఎంపీఓ సమ్మిరెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందికి ఎగ్స్ ట్రేలను అందజేశారు.ఎంపీఓ సమ్మిరెడ్డి సర్పంచ్ చిందం మహేష్ మాట్లాడుతూ,.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమైందని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారు చేస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. గ్రామ సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.ఈఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



కొడిమ్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా, కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గులాం మొయినుద్దీన్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. టేకు చెట్ల నరికివేత, రవాణా అనుమతులు మంజూరు చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి మొదట రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసిన ఆయన, గతంలోనే రూ.1 లక్ష తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.అధికారిక ప్రక్రియ పూర్తయిన అనంతరం మిగిలిన మొత్తాన్ని రూ.80 వేలకు తగ్గించి, గురువారం తన కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అనిశా అధికారులు తెలిపారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జనగణన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించాలన్నారు.జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని శంకరంపేట ఆర్ మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి , హార్టికల్చర్ అధికారి,ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు.ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్- -2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ , ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు.గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎ×=-2026), పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడిని అలవాటు చేసుకొని ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ గ్రామ సభలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ అధికారి దేవకుమార్ , హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ,సర్పంచ్ సంతోష నవీన్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికకు గ్రామస్థాయిలో విశేష స్పందన

**- గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అధికారుల ముఖాముఖి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు గ్రామస్థాయిలో అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అనంతపల్లి, కోరెం, దుంద్రపల్లి, బూరుగుపల్లి, తడగొండ, మల్కాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.గ్రామాల అభివృద్ధి,మౌళిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై అధికారులు గ్రామస్తులతో చర్చించారు. ప్రజలు తమ గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల అవసరాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఎస్ఐ, ఏఈఓలు, ఏపీఎం, సీడీపీఓ, ఏపీఓ, ఎంఈఓ, అటవీ శాఖ అధికారి, జీపీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి పడి కార్మికుడు మృతి



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఒక భవనంపై నుండి కింద పడి ఓ వలస కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవర రవి అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ఇక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే మేడ్చల్ పరిధిలోని నవోదయ వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవనంలోని 3వ అంతస్తులో రవి సెంట్రింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రవి పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రమైన గాయాలు కావడంతో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

**దర్యాప్తు చేస్తున్న పోలీసులు :**

సమాచారం అందుకున్న వెంటనే మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, అక్కడున్న ఇతర కార్మికులను విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# గ్రౌండ్ లో ఒకలా,ఆర్డర్ లో మరోలా:అడ్వకేట్ శ్యామల



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కోర్టు ఉత్తర్వులు భేఖాతరు చేసిన జిహెచ్ఎంసి అధికారులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ శ్యామలరెడ్డి పేర్కొన్నారు. ప్రహరీ గోడను కూల్చివేయవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాలను పెడచెవిన పెట్టి జిహెచ్ఎంసి అధికారులు నిర్దాక్షిణ్యంగా ప్రహరి గోడను కూల్చివేయడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పాత బోయిన్ పల్లి డివిజన్ రాజరాజేశ్వరీ (అర్అర్ టౌన్షిప్) టౌన్ షిప్ లో ఆమె విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తమ పూర్వికులకు మొత్తం 15 ఎకరాల్లో 1980లో సేయింట్ మెరిస్ సోసైటికి 5 ఎకరాలు స్థలం అభివృద్ధి చేయమని (డెవలప్మెంట్కు) ఇచ్చారు.తిరిగి లే ఆవుల్ అనుమతుల కొరకు 3 ఎకరాలు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఎ) ఇచ్చారు. మొత్తం 15 ఎకరాలకు తనతండ్రివాట క్రింద వచ్చిన స్థలానికి నాకు వారసత్వంగా వచ్చిన తన తండ్రి లక్ష్మారెడ్డి 840 గజాల స్థలాని తనకు కేటాయించారని అలా కేటాయించిన స్థలంలో గతంలో ఇళ్లు నిర్మిస్తున్న క్రమంలో సోసైటి వాళ్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కూకట్ పల్లి జిహెచ్ఎంసీ అధికారులు కూల్చివేతలు చేపట్టడంతో,అటు జిహెచ్ఎంసీ అధికారులపై కోర్టులో కేసులు వేయటం జరిగిందని అలా ఉన్న క్రమంలో తన స్థలంలో ప్రీకాస్ట్వాల్ నిర్మించిన క్రమంలో జూన్ 11 వరకు "కోర్టు స్టేటస్ కో" ఉన్న జిహెచ్ఎంసీ అధికారులు ఎలా కూల్చివేతలు చేస్తారని ప్రశ్నించారు.తాను ఒక మహిళగా ఎన్నో ఏళ్లనుంచి పోరాటం చేస్తున్న సోసైటీ సభ్యులు తమపై అనవసరంగా ఫిర్యాదు చేస్తు తనను మానసికంగా వేధిస్తున్నారని అన్నారు.తమ స్థలాలో నిర్మాణాలు చేపడుతున్న తమ ఇళ్లపై కేసులు వేస్తున్నారని కోర్టుఫీజ్ను చెల్లించి ఇంటిలో నివాసముంటున్నానని అకారణంగా కూల్చివేతలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

# బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన తహశీల్దారు, సర్పంచ్



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) బండలింగంపల్లిలోని మహమ్మద్ అయూబ్ ఇల్లు గత రెండు రోజుల క్రితం కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమైంది. వారి యొక్క నిత్యవసర వస్తువులు బట్టలు వివిధ రకాల సామాగ్రి పూర్తిగా ఖాళీ బూడిదయింది. దీన్ని చూసి చలించిపోయిన బండ లింగంపల్లి సర్పంచ్ బాలరాజు నరస గౌడ్ వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించి, అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ఆ కుటుంబానికి ధైర్యాన్ని నింపి, మండల తాహశీల్దార్ సుజాత దృష్టికి తీసుకుపోగానే తహశీల్దార్ జిపిఓ, ఆర్ఐ లను పంపించి సంబంధిత సమాచారాన్ని కలెక్టర్ గరీమ అగర్వాల్ కి వివరించి, తక్షణ సహాయం కింద 5000/- రూపాయలు, 50 కిలోల బియ్యం నిత్యవసర వస్తువులు అందించేలా కృషిచేసిన సర్పంచ్ బాలరాజ్ నర్సాగౌడ్ కి తహశీల్దార్ సుజాతకి మహమ్మద్ అయూబ్, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బండ లింగంపల్లి పాలకవర్గం, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట శివారులో బావిలో మృతదేహం లభ్యం

**- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మన్నె కళ (45) అనే మహిళ బావిలో పడి మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మన్నె యాదగిరి, కళ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు సమాచారం.పెళ్లి వయసుకు వచ్చిన ఇద్దరు కుమార్తెల వివాహాలు, కుటుంబ పోషణ భారంతో దంపతులు తరచూ ఆందోళన చెందేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 3న మధ్యాహ్నం 2 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో వడ్లు ఎత్తడానికి వెళ్తున్నానని చెప్పి కళ ఇంటి నుంచి వెళ్లిపోయింది.సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. జూన్ 4న ఉదయం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని నరెడ్ల రాజిరెడ్డి బావి వద్ద ఆమె చెప్పులు కనిపించడంతో అనుమానం వ్యక్తమైంది. బావిలో వెతకగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో మన్నె కళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు మన్నె లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తొగుట ఎస్‌హెచ్‌వో తెలిపారు.

# నాణ్యత తక్కువ.. ధరలు ఎక్కువ

## - సమస్యలకు నిలయంగా తెలంగాణ ఫిష్ క్యాంటీన్
## - రుచులు అంతంత మాత్రమే.. జేబుకు మాత్రం ధరల భారం
## - ప్రభుత్వ సంస్థ పేరుతో నడుస్తున్నా నిర్వహణలో ఘోర నిర్లక్ష్యం







హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ఫిషర్ కో--ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఫిష్ క్యాంటీన్ ప్రస్తుతం అనేక విమర్శలకు కేంద్రబిందువుగా మారింది. నాణ్యత లేని ఆహారం, అధిక ధరలు, సమయపాలన లేకపోవడం, పరిశుభ్రత లోపించడం వంటి అనేక సమస్యలతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### సమయపాలన పాటించరా.?

నిబంధన ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభం కావాల్సిన క్యాంటీన్ తరచూ మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల మధ్య ప్రారంభమవుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. భోజనం కోసం సమయానికి వచ్చే ఉద్యోగులు, సందర్శకులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సమయపాలనపై అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ధరలు స్టార్ హోటల్ స్థాయిలో.. రుచి మాత్రం ఫుట్‌పాత్ కంటే దారుణం

క్యాంటీన్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల ధరలు చూస్తే ప్రైవేట్ రెస్టారెంట్ల కంటే అధికంగా ఉన్నాయని, సబ్సిడీ ధరలు లేకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. అయితే ఆహార నాణ్యత, రుచి మాత్రం అత్యంత నిరాశాజనకంగా ఉందని అంటున్నారు. ఫుట్‌పాత్‌పై విక్రయించే ఆహార పదార్థాలు కూడా దీనికంటే మెరుగ్గా ఉంటాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నాసిరకం పదార్థాల వినియోగమా.?

తెలంగాణ ఫిష్ క్యాంటీన్ కూరల్లో అధికంగా నూనె వినియోగించడం, అన్నం సరిగా ఉడకకపోవడం, వంటకాలలో రుచి లేకపోవడం వంటి అనేక అంశాలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. నాసిరకం ఆహార పదార్థాలు వాడుతున్నారా.? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

### సెల్ఫ్ సర్వీస్ పేరిట వినియోగదారుల ఇబ్బందులు

అధిక ధరలు చెల్లించినప్పటికీ వినియోగదారులు స్వయంగా సర్వీస్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది వ్యవహార శైలి, సేవల తీరు కూడా పూర్తి అసంతృప్తికరంగా ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధ్యతారాహిత్యం, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

### అధికారుల నిర్లక్ష్యమే కారణమా.?

ప్రభుత్వ సంస్థ, సొసైటీ నిర్వహిస్తున్న క్యాంటీన్ కావడంతో అధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిషరీస్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యత, పరిశుభ్రత, ధరలు, సేవలపై దృష్టి పెట్టాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### తింటే బాధ.. మళ్లీ రావాలంటే భయం

ఒక్కసారి భోజనం చేస్తే మళ్లీ ఎందుకు వచ్చామా దేవుడా అనిపిస్తోంది. రుచి లేదు, సమయపాలన లేదు,

ధరలు అధికం. అన్నం ఉడకదు, కూరల్లో నూనె ఎక్కువ. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాంటీన్ అంటే ఇలానా.? అంటూ పలువురు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

### అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి

తెలంగాణ ఫిష్ క్యాంటీన్ నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యత ప్రమాణాలు అమలు చేయాలని, ఆహార పదార్థాలపై తనిఖీలు నిర్వహించాలని, ధరలను సమీక్షించాలని, సమయపాలనను కచ్చితంగా అమలు చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ క్యాంటీన్‌లు విమర్శల పాలవుతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# విద్యా సంస్థలా.. వసూళ్ల అడ్డాలా.?




- విద్య పేరుతో నడ్డి విరుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు
- ఆటస్థలాలు లేకున్నా ఆకాశాన్నంటుతున్న ఫీజులు
- డ్రెస్సులు, పుస్తకాల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు
- పిల్లల గొప్ప భవిష్యత్తు ఇస్తామంటూ తల్లిదండ్రులకు ఎర వేస్తున్న ప్రైవేట్ స్కూల్స్
- ప్రకటనల్లో అంతర్జాతీయ ప్రమాణాలు, వాస్తవంలో ఇరుకు ప్రాంగణాలు
- పలు పాఠశాలల్లో కనిపించని ఫైర్ ఎన్‌ఓసీలు, మెడికల్ ఎమర్జెన్సీలు
- విద్యాశాఖ నిబంధనలను ప్రక్కన పెట్టిన ప్రైవేటు పాఠశాలలు

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల వ్యవహారశైలి ప్రస్తుతం తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. నాణ్యమైన విద్య, అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాల పేరుతో అడ్మిషన్ల సమయంలో భారీ ప్రచారం నిర్వహిస్తున్న కొన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు చేరిన తర్వాత ఫీజుల రూపంలో తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, స్కూల్ మెటీరియల్, రవాణా, ప్రత్యేక కార్యక్రమాల పేరిట అదనపు వసూళ్లు చేస్తున్నారని పేరెంట్స్ వాపోతున్నారు. అంతేకాకుండా కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగిన క్రీడా ప్రాంగణాలు లేకపోవడం, ఇండోర్ లేదా అవుట్ డోర్ ఆటల కోసం సరైన సౌకర్యాలు కనిపించకపోవడం, ఇరుకు ప్రాంగణాల్లోనే వందలాది మంది విద్యార్థులకు బోధన కొనసాగుతుండటంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటనల్లో ప్రపంచస్థాయి వసతుల గురించి గొప్పగా ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భద్రతకు సంబంధించి కూడా పలు సందేహాలు తలెత్తుతున్నాయి. కొన్ని విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, అత్యవసర బయటకు వెళ్లే మార్గాలు, మెడికల్ ఎమర్జెన్సీలకు అవసరమైన ఏర్పాట్లపై స్పష్టత లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. రోజూ వందలాది మంది విద్యార్థులు హాజరయ్యే విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాల అమలుపై సంబంధిత శాఖలు ఎంతవరకు పర్యవేక్షణ చేస్తున్నాయన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులకున్న ఆందోళనను ఆసరాగా చేసుకుని కొందరు విద్యాసంస్థలు ప్రచార ఆర్భాటాలతో ఆకర్షిస్తున్నాయని, ఒకసారి అడ్మిషన్ తీసుకున్న తర్వాత ఫీజులు, అదనపు చార్జీల రూపంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. మరోవైపు విద్యాశాఖ నిర్దేశించిన నిబంధనల అమలు, మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలపై క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్నాయా లేదా అన్న అంశంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేస్తున్నారన్న విమర్శల మధ్య, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నిర్మాణం, మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ జరపవలసిన అవసరం ఉంది.

### ఆకర్షణీయ ప్రచారాలతో చేరికల వేట..

విద్యా నాణ్యత, ప్రత్యేక బోధన, విదేశీ ప్రమాణాల పేరుతో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. అయితే చేరికల అనంతరం అదనపు ఖర్చులు చూపిస్తూ అన్ని రకానికి దోచుకోవడంతో కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మౌలిక వసతులపై సందేహాలు..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన ప్రాంగణాలు, క్రీడా సౌకర్యాలు, ప్రయోగశాలలు, ఇతర అవసరమైన సదుపాయాలు ఉన్నాయా అనే అంశంపై పలుచోట్ల ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అందుబాటులో ఉన్న స్థలాలతోనే అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### భద్రత ఏర్పాట్లపై ఆందోళన..

అగ్నిప్రమాదాలు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు వంటి సందర్భాల్లో తక్షణ స్పందనకు అవసరమైన వ్యవస్థలు, శిక్షణ పొందిన సిబ్బంది, అత్యవసర మార్గాలు, భద్రతా తనిఖీల స్థితిగతులపై తల్లిదండ్రులు స్పష్టత కోరుతున్నారు.

### నియంత్రణ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు..

ఫీజుల నిర్మాణం, సౌకర్యాల ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖలు ఎంతవరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అనుమతి ఉన్నా లేకున్నా..
# ధర్నా ఆగదు


### - కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్‌లో వ్యంగ్య వేదికగా ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇందులో భాగంగా నేడు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ప్రకటించింది. పోలీసుల అనుమతి లభించినా, లభించకపోయినా శాంతియుత పద్ధతిలో తమ నిరసనను కొనసాగిస్తామని పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఈ ఉద్యమం పురుడుపోసుకుంది. ముఖ్యంగా నీట్-యూజీ 2026 పేపర్ లీకేజీ వంటి వరుస కుంభకోణాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారడంపై ఈ వేదిక గళమెత్తుతోంది. ప్రస్తుతం బోస్టన్‌లో ఉన్న పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ డిప్కే, ఈ నిరసన కార్యక్రమానికి నేతృత్వం వహించేందుకు జూన్ 6వ తేదీ ఉదయం 8 గంటలకు ఢిల్లీ చేరుకోనున్నారు. ఆయన వచ్చిన తర్వాతే పోలీసుల అనుమతి కోరుతూ దరఖాస్తు చేస్తామని ప్రజాస్వామ్య నిరసనలకు అధికార యంత్రాంగం కల్పిస్తున్న అడ్డంకులను నిరసించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, విజేతా దహియా, అశుతోష్ రాంకా వెల్లడించారు. ఈ ఉద్యమానికి ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇప్పటికే తన మద్దతు ప్రకటించారు. విద్యా వ్యవస్థలో సంస్కరణల దిశగా ప్రభుత్వం జూన్ 5వ తేదీలోగా తగిన చర్యలు తీసుకోని పక్షంలో, తాను కూడా ఈ నిరసనలో పాలుపంచుకుంటానని ఆయన హెచ్చరించారు.

# విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి

### - హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-3 (ఫారం-సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-2లో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి. 2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

## సరోగసీ కేంద్రాల నియంత్రణ..
## కేంద్రం అభిప్రాయాన్ని
# కోరిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్)** పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588